సూర్యాపేట ప్రభుత్వ పాఠశాలలో 102 ఆకారంలో కూర్చున్న నూతన ప్రవేశాలు పొందిన విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలలో 102 కొత్త అడ్మిషన్లు

- నాణ్యమైన బోధన వల్లే : హెచ్ఎం

సూర్యాపేట అర్బన్, జూన్ 28 : ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ పెరుగుతుందని, నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం బోధన వల్ల అడ్మిషన్లు పెరుగుతున్నాయని ప్రధానోపాధ్యాయుడు జె.ఆంథ్రయ్య అన్నారు. జూనియర్ కళాశాల పక్కన గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 102 కొత్త అడ్మిషన్లు వచ్చిన సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రైవేటులో భారీగా పెరిగిన ఫీజులు, దానికి తోడు నాణ్యమైన విద్య కూడా లభించడం లేదని గుర్తించిన తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల బాట పడుతున్నారన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను వివిధ తరగతుల్లో కలిపి 102 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారని మొత్తం 186 మంది విద్యార్థులు ఉన్నట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రవేశాలు పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయులు గతం కంటే ఉత్సాహంగా పని చేసేందుకు సిద్ధం కావాలని సూచించారు. అనంతరం ప్రవేశాలు పొందిన విద్యార్థులు 102 ఆకారంలో కూర్చొని అలరించారు.

గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు రావద్దు

- పంచాయతీ జిల్లా అధికారి సురేశ్‌కుమార్

గరిడేపల్లి : రాయినిగూడెంలో వీధులను పరిశీలిస్తున్న డీపీఓ సురేశ్

గరిడేపల్లి, జూన్ 28: గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు రాకుండా చూడాలని పంచాయతీ జిల్లా అధికారి సురేశ్‌కుమార్ అన్నారు. మండలంలోని రాయినిగూడెం గ్రామంలో శుక్రవారం జరిగిన డ్రై డే కార్యక్రమంలో భాగంగా ఆయన పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ త్వర లో జరుగనున్న వన మహోత్సవం కార్యక్రమానికి మొక్కలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అంటువ్యాధుల నివారణకు అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. ప్రతీ గ్రామ పంచాయతీలో బ్లీచింగ్, ఫినాయిల్, దోమల నివారణ మందులు నిల్వ ఉంచుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు డీఎస్ఆర్‌ను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.ర ఈ కార్యక్రమంలో ఎంపీఓ మౌలానా, పంచాయతీ కార్యదర్శి సుధీర్, వైద్య, అంగన్‌వాడీ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్లు సామాజిక సేవలో ముందుండాలి

- కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రమీల, కమిషనర్ రమాదేవి

పెన్షనర్లను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ ప్రమీల

కోదాడటౌన్, జూన్ 28 : విశ్రాంత ఉద్యోగులు సామాజిక సేవలో ముందుండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, కమిషనర్ రమాదేవి అన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం పట్టణ యూనిట్ అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన విశ్రాంత ఉద్యోగుల జన్మదిన వేడుకలను శుక్రవారం సామూహికంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా జన్మదినం జరుపుకునే వారిని కేక్ కట్ చేయించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య, జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీనర్సయ్య, బొల్లు రాంబాబు, వెంకటేశ్వర్‌రావు, విద్యాసాగర్, నర్సయ్య, భ్రమరాంబ, శోభ, రఘువరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి

- జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి

ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా అధికారి శ్రీధర్‌రెడ్డి

కోదాడ రూరల్, జూన్ 28 : డీలర్లు రైతులకు కావాల్సిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని విత్తన, ఎరువుల దుకాణాలను శుక్రవారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. డీలర్లు రైతులకు బిల్లు ఇవ్వాలని, ఎమ్మార్పీ ధరకే విక్రయించాలని సూచించారు. అనంతరం పట్టణ పరిధిలోని తమ్మరలో రైతులు సాగుచేసిన జీలుగు పంటను పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి పాలెం రజిని, ఏఈఓ ఆఫ్రిన్, సీఈఓ వెంకటేశ్వర్లు, రైతులు, డీలర్లు పాల్గొన్నారు.

గోర్ బంజారా జాతీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

బొడ్రాయిబజార్, జూన్ 25 : గిరిజన లంబాడీల హక్కుల సాధనతో పాటు ఎల్‌హెచ్‌పీఎస్ 28వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూలై 1న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించే గోర్ బంజారా జాతీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ సూర్యాపేట జిల్లా కన్వీనర్ భూక్యా రాజునాయక్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో గోర్ బంజారా జాతీయ సమ్మేళన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గుగులోతు సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బర్మావత్ రాజునాయక్, ధరావత్ నాగేందర్‌నాయక్, ధరావత్ మంగ్తానాయక్, భూక్యా రవినాయక్, బర్మావత్ హుస్సేన్, నూనావత్ నాగేంద్ర, బానోతు నందలాల్, ప్రవీణ్ తదితరులున్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా యొక్క క్లయింటు అయిన చిలక @ చిలకల కళ్యాణి, భర్త: శ్రీనివాస్ రెడ్డి, నివాసం: గుడిమల్కాపురం, చింతలపాలెం మం., సూర్యాపేట జిల్లా గారి నుండి సంజాయిషీ పొంది సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా!

నా క్లయింటు ఈ క్రింది షెడ్యూల్ ఆస్తిని విక్రయ రిజిస్ట్రార్ దస్తావేజు నెం. 11066/2021 ద్వారా పూసపాటి లక్ష్మి, భర్త: రామారావు నుండి కొనుగోలు చేసి ఆనాటి నుండి తమ సంపూర్ణ స్వాధీన యాజమాన్య హక్కు కలిగి యున్నారు. ఇట్టి ఒరిజినల్ దస్తావేజు నెం. 11066/2021 దస్తావేజు మూలాధారమైన ఒరిజినల్ లింకు దస్తావేజు నెంబర్లు: 3940/2021, 8299/2018, 3698/2016, 3668/2016, 5583/2014, 4505/2014, 361/1995, 54/95 వీటిలో నుండి 4505/2014, 361/1995, 54/95 మఠంపల్లిలో జిరాక్సు తీసుకునే సమయంలో పోయినవి. ఇట్టి ఒరిజినల్ డాక్యుమెంటును ఎంత వెతికినను లభించలేదు. ఇట్టి దస్తావేజును నా క్లయింటు అయిన చిలక @ చిలకల కళ్యాణి గారు ఏదైనా బ్యాంకులకు గాని, ఆర్థిక సంస్థలకు గాని, వ్యక్తులకు గానీ, లీజు గాని ఏ విధమైన తాకట్టు గానీ కుదువ పెట్టడం గానీ చేసియుండలేదు. ఇట్టి ఆస్తిని తనఖాయుంచి నా క్లయింటు ప్రభుత్వ లేదా ప్రయివేటు బ్యాంకులో లేదా ఇతర ఫైనాన్సు కంపెనీల నుండి లోను తీసుకోదలచినారు. ఇట్టి దస్తావేజుల ద్వారా ఎవరికైనా, ఏ విధమైన హక్కులు సంక్రమించియున్న పక్షములో ఈ క్రింద తెలిపిన చిరునామాకి సంబంధిత ఆధార పత్రాలతో వారి యొక్క హక్కులు ఈ ప్రకటన వెలువడిన తేది నుండి వారం (7) రోజులలో తెలుపుకొనగలరు. దరిమిలా వచ్చిన ఆక్షేపణలు నా యొక్క క్లయింటును ఏ విధముగా కూడా బాధ్యులను చేయజాలవు. అభ్యంతరములు తెలియజేయవసిన చిరునామా.

షెడ్యూలు ఆస్తి: నల్లగొండ జిల్లా రిజిస్ట్రారు గారి అజ్మాయిషికి లోనై యుండి కోదాడ సబ్-రిజిస్ట్రార్ గారి కార్యాలయాధికార పరిధిలో గల కోదాడ మున్సిపాలిటీ, కోదాడ రెవిన్యూ మండలంలోని సర్వే నెం. 160, 161 బ్లాకు నెం. 3, పార్ట్-ఎ లోని ప్లాటు నెం. 47/1 దాఖలా ఖాళీ స్థల విస్తీర్ణం: 208 చ.గ.లకు హద్దులు: ఉత్తరం: కక్కిరేణి రామారావు గారి ఇల్లు, దక్షిణం: పంట కాలువ, తూర్పు: ప్లాటు నెం. 39, పడమర: 24 అ.ల మునిసిపాలిటీ రోడ్డు.

సం./- **నాగబండి కృష్ణమూర్తి**, అడ్వకేటు,
ఇ.నెం. 3-199/1/సి, పబ్లిక్ క్లబ్ ఎదురుగా, నయానగర్,
కోదాడ-508206, సూర్యాపేట జిల్లా. సెల్: 9848256389.

పుస్తెల తాడు చోరీ

గరిడేపల్లి, జూన్ 28: మండలంలోని సుభాష్‌నగర్‌లో వృద్ధురాలి మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం పుస్తెల తాడును చోరీ చేశారు. వివరాలు.. గ్రామానికి చెందిన గాదె రామనర్సమ్మ శివారులో పెసర చేను ఏరడానికి వెళ్లింది. అదే దారిన గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి కంకరమిల్లుకు ఎలా వెళ్లాలి పెద్దమ్మా అంటూ పలుకరించాడు. రామనర్సమ్మ మాట్లాడుతుండగానే మెడలో ఉన్న మూడు తులాల పుస్తెలతాడును లాక్కొని పరార్ అయ్యాడు. మహిళ కేకలు వేయడంతో చుట్టు పక్కన వాళ్లు వెంబడించినా ఫలితం లేకుండా పోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఈట సైదులు తెలిపారు.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సైదులు

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికా యుగంధర్‌రావు, ఎమ్మెల్యే సామేల్

తుంగతుర్తి, జూన్ 28 : గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్ రావు, ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండల పరిధిలోని తూర్పుగూడెం గ్రామంలో నూతన మహిళా సమైక్య భవనం, గ్రంథాలయం, పాఠశాల టాయిలెట్లను శుక్రవారం వారు శంకుస్థాపన మాట్లాడారు. మహిళా సమైక్య భవనాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుండగాని కవితారాములు గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, గ్రామశాఖ అధ్యక్షుడు గుండగాని సుధాకర్, ఓరుగంటి సత్యనారాయణ, పెండెం రామ్మూర్తి, గుండగాని మహేందర్, తొట్ల శ్రీనివాస్‌గౌడ్, దాయం ఝాన్సీరెడ్డి, నల్లు రాంచంద్రారెడ్డి, రుద్ర రామచంద్రు, బాషబోయిన వెంకన్న, రామ్మూర్తి, మల్లేశ్, మల్లేశ్‌నేత, తాటికొండ సీతయ్య, దుర్గయ్య, తునికి సాయిలు పాల్గొన్నారు.

మహిళా సమైక్య భవనాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ దీపికాయుగంధర్‌రావు, ఎమ్మెల్యే మందుల సామేలు

సైదులు సార్ వెళ్లొద్దు ప్లీజ్..

- బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడిని వేడుకున్న విద్యార్థులు

ఉపాధ్యాయుడి కాళ్లమీద పడి ఏడుస్తున్న విద్యార్థులు

మద్దిరాల, జూన్ 28 : మండలంలోని పోలుమల్ల జడ్పీహెచ్ఎస్‌లో మెంతబోయిన సైదులు 14 సంవత్సరాలుగా తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీల ప్రక్రియలో భాగంగా ఆయనకు నూతనకల్ మండలం ఎర్రపహాడ్ జడ్పీహెచ్ఎస్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యింది. గురువారం పాఠశాలలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో విద్యార్థులు ఆయన సేవలను మరువలేక వెళ్లిపోవద్దు సార్.. అంటూ బోరున విలపించారు. ఉపాధ్యాయుడి కాళ్లమీద పడి సైదులు సార్ ప్లీజ్ వెళ్లొద్దంటూ వేడుకున్నారు. విద్యార్థులను ఎంత గొప్పగా తీర్చిదిద్దితే ఇంతటి ప్రేమ, గౌరవం దక్కాలని తోటి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సైదులు సార్‌ను అభినందించారు.

కూచిపూడిలో మహాసుదర్శన లక్ష్మీనరసింహ యాగం

కూచిపూడి సుదర్శన యాగంలో పాల్గొన్న భక్తులు

కోదాడ రూరల్, జూన్ 28 : మండల పరిధి కూచిపూడిలో నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం యాదాద్రి లక్ష్మినరసింహస్వామి దేవాలయ ప్రధానార్చకుడు లక్ష్మీనరసింహా చార్యుల ఆధ్వర్యంలో మహాసుదర్శన లక్ష్మీనరసింహ యాగం నిర్వహించారు. ఎంపీపీ మల్లెల రాణి, జడ్పీటీసీ మందలపు కృష్ణకుమారి, శెట్టి భాస్కర్‌రావు, పూర్ణ, నాంచరయ్య, శ్రీనివాస్‌రావు, బాబురావు, భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పసునూరులో మల్లికార్జునస్వామి కల్యాణం

నాగారం, జూన్ 28 : మండలంలోని పసునూరు గ్రామంలో భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కుందుర్తి కృష్ణప్రసాద్, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎం. రాంబాబు

మాట్లాడుతున్న రాంబాబు

మోతె, జూన్ 28 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. రాంబాబు డిమాండ్ చేశారు. మోతె మండల పరిధిలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామపంచాయతీలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో శుక్రవారం జరిగిన సీఐటియూ మండల జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు ప్రధాన సెంటర్‌లో నూతనంగా నిర్మించిన సీఐటీయూ జెండాను సీనియర్ నాయకుడు గుంట గాని ఏసు ఆవిష్కరించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం మండలాధ్యక్షుడు ఒగ్గు సైదులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు మట్టిపల్లి సైదులు, గోపాల్‌రెడ్డి, గుంటగాని ఏసు, కిన్నెర పోతయ్య, దోసపాటి శ్రీను, చిట్యాల రవిచంద్ర, సామ సంజీవరెడ్డి, బొమ్మగాని వెంకటేశ్, రంగయ్య, వీరన్న, శ్రీను, జలగం తిరుపతయ్య, వెంకట్‌రెడ్డి, మల్లయ్య, రమేశ్, వెంకన్న పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత... వాహనం సీజ్

సీజ్ చేసిన బైక్‌తో ఎక్సైజ్ అధికారులు

కోదాడ రూరల్, జూన్ 28 : పట్టణ శివారు గుడిబండ రోడ్డు వద్ద శుక్రవారం గంజాయి పట్టుకున్నారు. సీఐ శంకర్ తెలిపిన వివరాలు.. గుడిబండ రోడ్డులో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తుండగా కోదాడ పట్టణానికి చెందిన కొత్తపల్లి గోపి, వేముల నవీన్ స్కూటీపై వస్తున్నారు. అనుమానం వచ్చి వారి వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 900 గ్రాముల గంజాయి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఎక్సైజ్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు సమానత్వం కల్పించాలి : ఐద్వా

మాట్లాడుతున్న కేంద్ర కమిటీ సభ్యురాలు టి.జ్యోతి

బొడ్రాయిబజార్, జూన్ 28 : మహిళలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో సమానత్వం కల్పించాలని ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలు టి.జ్యోతి అన్నారు. స్థానిక ఎంవీఎన్ భవన్‌లో శుక్రవారం రెండ్రోజుల పాటు జరగనున్న ఐద్వా సూర్యాపేట జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలపై అరాచకాలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలన్నారు. అంతకు ముందు ఐద్వా జెండాను సీనియర్ నాయకురాలు గోలి భాగ్యమ్మ ఆవిష్కరించగా జిల్లా ప్రధాన కార్యదర్శి మేకనబోయిన సైదమ్మ అధ్యక్షత వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు మద్దెల జ్యోతి, జూలకంటి విజయలక్ష్మి, అండం నారాయణమ్మ, సురభి లక్ష్మి, దేవిరెడ్డి జ్యోతి, సృజన, నెమ్మాది లక్ష్మి, ముల్కూరి మణెమ్మ, ఎడమ పద్మ తదితరులున్నారు.

జూలై 8 వరకు పదో తరగతి రీ వెరిఫికేషన్

సూర్యాపేట అర్బన్, జూన్ 28 : ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో 86.63 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు జూలై 8 వరకు రీ వెరిఫికేషన్‌కు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. రూ.1000 చాలనా చెల్లించి రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రీ కౌంటింగ్ కోసం ప్రతి సబ్జెక్టుకు రూ.500 చెల్లించాలని తెలిపారు. వివరాలకు, పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నేరేడుచర్ల, జూన్ 28 : మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదంలో శుక్రవారం వ్యక్తి మృతిచెందాడు. వివరాలు.. స్థానిక రాజీవ్‌నగర్‌కు చెందిన ఎస్.కే యూసుఫ్ (55) సెంట్రింగ్ మేస్త్రీగా పని చేసేవాడు. వృత్తి రిత్యా ద్విచక్ర వాహనంపై మిర్యాలగూడకు వెళ్తుండగా మండలంలోని చిల్లేపల్లి చెరువు వద్దకు రాగానే కడప నుంచి జగ్గయ్యపేటకు కెమికల్స్ లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. తీవ్ర గాయాలైన యూసుఫ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతిడి భార్య ఏడాది క్రితమే మరణించగా ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు యూనుస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా దవాఖానకు తరలించినట్లు ఎస్ఐ రవీందర్ నాయక్ తెలిపారు.

నిరంతర అధ్యయనంతోనే విజయం

సూర్యాపేట అర్బన్, జూన్ 28 : నిరంతర అధ్యయనంతోనే విద్యార్థులు విజయం సాధిస్తారని జిల్లా కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాతి సవేందర్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా స్టడీ సర్కిల్ లైబ్రరీకి పుస్తకాలు అందజేశారు. స్టడీ సర్కిల్ డైరెక్టర్ చిట్టిపాక రాములు, హుస్సేన్, మల్లయ్య, అశోక్, రంజిత్ కుమార్, అఖిల్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు, సైబర్ నేరాలపై అవగాహన

ఆత్మకూర్.ఎస్, జూన్ 28 : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సైదులు, పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో నకిలీ విత్తనాలు, సైబర్ నేరాలపై గురువారం రాత్రి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ పి.పవన్‌కుమార్, హోంగార్డు మధుసూదన్‌రెడ్డి, కళాబృందం ఇన్‌చార్జి ఎల్లయ్య, గోపి, కృష్ణాచారి, గురులింగం, గ్రామస్తులు పాల్గొన్నారు.

జర్నలిస్టు కుటుంబానికి మంత్రి ఆర్థికసాయం

హుజూర్‌నగర్, జూన్ 28 : పట్టణానికి చెందిన జర్నలిస్ట్ ఎలక సైదులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి దంపతులు ఆయన కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్ శుక్రవారం సైదులు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు నగదును అందజేసి నివాళులర్పించారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు

నాగారం, జూన్ 28 : నాగారం మండల కేంద్రంలో తాగునీటి కోసం ఎమ్మెల్యే మందుల సామేల్ సొంత నిధులు రూ.5లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తాగునీటి సమస్య తీర్చడం సంతోషంగా ఉందన్నారు.

ఎన్‌డీసీఎంఎస్ నూతన చైర్మన్‌ను కలిసిన క్రైస్తవ నాయకులు

బొడ్రాయిబజార్, జూన్ 28 : ఎన్‌డీసీఎంఎస్ నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బొళ్ల వెంకట్‌రెడ్డిని ఉమ్మడి నల్లగొండ జిల్లా క్రైస్తవ నాయకులు, పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ దుర్గం ప్రభాకర్ శుక్రవారం నల్లగొండలో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కలసిన వారిలో కేతేపల్లి ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, దుర్గం శంకర్, అంజి, అజయ్ ఉన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, కౌన్సిలర్లు

అభివృద్ధి చేసినవారిపై అవినీతి మరకలు వేసే ప్రయత్నం

- మున్సిపల్ వైస్ చైర్మన్ కిశోర్

బొడ్రాయిబజార్, జూన్ 28 : సూర్యాపేట పట్టణాన్ని అభివృద్ధి చేసినవారిపై అవినీతి మరకలు అంటించే ప్రయత్నం జరుగుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ అభివృద్ధికి రూ.80కోట్ల నిధులు కేటాయించి.. పనులు ప్రారంభమైన తరువాత నిధులను వెనక్కి మళ్లించడం కాంగ్రెస్‌కే చెందుతుందన్నారు. ఓట్లు వేయలేదని పట్టణాన్ని నాశనం చేసే బాధ్యతను కాంగ్రెస్ తీసుకుందని విమర్శించారు. అభివృద్ధిలో సూర్యాపేట నంబర్ 1గా ఉంది కాబట్టే మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి హ్యాట్రిక్ గెలుపు సాధ్యమైందన్నారు. మూడుసార్లు ప్రజలు తిరస్కరించారనే అక్కసుతో నిర్మాణాల కూల్చివేతలు మొదలు పెట్టారని కాంగ్రెస్‌పై మండి పడ్డారు. సూర్యాపేటకు రావాల్సిన నీటి వాటా గురించి మంత్రి ఉత్తమ్‌ను నిలదీయాలని కాంగ్రెస్ కౌన్సిలర్లకు సూచించారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కౌన్సిలర్లు చింతలపాటి భరత్ మహాజన్, తాహేర్ పాషా మాట్లాడుతూ 50 ఏండ్ల చరిత్రలో ఓ దళిత మహిళ చైర్‌పర్సన్‌గా ఉంటే అమెను కించపరుస్తున్నారని, దళితులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి బూర బాలసైదులుగౌడ్, నాయకులు ఆకుల లవకుశ, బత్తుల జాని, కొండపల్లి సాగర్‌రెడ్డి, ముదిరెడ్డి అనిల్‌రెడ్డి, శ్రీపాది జానకిరామ్, బైరు వెంకన్న తదితరులు ఉన్నారు.

యాక్టివ్ బ్లీడింగ్ కంట్రోల్ కిట్ ఎంతో ఉపయోగకరం

- డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

రక్తస్రావ నియంత్రణకు కిట్ ఎలా ఉపయోపడుతుందో డెమో చూపుతున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడటౌన్, జూన్ 28 : రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు యాక్టివ్ బ్లీడింగ్ కంట్రోల్ కిట్ ఎంతో ఉపయోగపడుతుందని డీఎస్పీ శ్రీధర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని మేళ్లచెర్వు కాశీనాథం ఫంక్షన్ హాల్‌లో ఐరాష్ట్ర తెలంగాణ, జీఎంఆర్, నేషనల్ హైవే ఆథారిటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఆధ్వర్యంలో యాక్టివ్ బ్లీడింగ్ కంట్రోల్ కిట్‌పై వీధి వ్యాపారులు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పాల్గొని మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో రక్త స్రావం కాకుండా ఈ కిట్ ఉపయోగపడుతుందన్నారు. కిట్‌ను తయారు చేసిన సంస్థలను ఆయన అభినందించారు. అనంతరం కిట్ ఉపయోగాలను చూపించి అందజేశారు.

కార్యక్రమంలో ఐ రాష్ట్ర ప్రాజెక్ట్ మేనేజర్ గోవింద కృష్ణ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ప్రతినిధులు శైలజ, శ్రీనివాస్, కోదాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు : ఎంపీపీ భిక్షం

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భిక్షం

పెన్‌పహాడ్, జూన్ 28 : మండలంలో ఐదేండ్ల పాటు అభివృద్ధికి సహకరించిన నాయకులు, అధికారులందరికీ ధన్యవాదాలని ఎంపీపీ నెమ్మాది భిక్షం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం చివరి జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాలకు మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సహకారంతో సుమారు రూ.625.85 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ, ఎంపీటీసీలను సత్కరించారు. జడ్పీటీసీ మామిడి అనితాఅంజయ్య, వైస్ ఎంపీపీ గార్లపాటి సింగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు వెన్న సీతారాంరెడ్డి, నాతాల జానకిరాంరెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఎంపీటీసీలు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

అధికారుల సమన్వయంతోనే మండలాభివృద్ధి : ఎంపీపీ మణి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కూరం మణి వెంకన్న

నాగారం, జూన్ 28 : అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసినప్పుడే మండలాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ కూరం మణి వెంకన్న అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ దార శ్రీనివాస్, ఇరిగేషన్ డీఈ పిచ్చయ్య, ఎంపీటీసీలు చింతల్‌రెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఏవూరి మంజుల, ఈరేటి స్వప్న, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి : ఎంపీపీ శ్రీనివాస్

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

హుజూర్‌నగర్ రూరల్, జూన్ 28 : మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మర్రిగూడెంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను శుక్రవారం పీఏసీఎస్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్‌కుమార్, ఎంపీటీసీ మచ్చ వెంకటేశ్వర్లు, నరసింహారావు పాల్గొన్నారు.

బీమా ఏజెంట్లకు సన్మానం

నేరేడుచర్ల, జూన్ 28 : జాతీయ జీవిత బీమా అవగాహన దినోత్సవం సందర్భంగా మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బీమా ఏజెంట్లను శుక్రవారం సన్మానించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా చైర్‌పర్సన్ మధు, సభ్యులు సత్యనారాయణ, సైదిరెడ్డి ఉన్నారు.

హెలెన్ ఆడమ్స్ కెల్లర్ జీవితం దివ్యాంగులకు స్ఫూర్తిదాయకం

బొడ్రాయిబజార్, జూన్ 28 : హెలెన్ ఆడమ్స్ కెల్లర్ జీవితం దివ్యాంగులకు స్ఫూర్తిదాయకమని వారి హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు అర్వపల్లి లింగయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌లో శుక్రవారం దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హెలెన్ ఆడమ్స్ కెల్లర్ 244వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

1న ఆర్డీఓ కార్యాలయాల ఎదుట ధర్నా

- ధనుంజయనాయుడు

గరిడేపల్లి, జూన్ 28 : ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 1న ఆర్డీఓ కార్యాలయాల ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు. దీన్ని వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.